నమస్తే తెలంగాణ
# నిర్మల్
5 | నిజామాబాద్, శనివారం 27 జనవరి 2024 | NIRMAL

# ఇదేం ఇగం

● ఆదిలాబాద్ జిల్లాలో పడిపోయిన కనిష్ఠ ఉష్ణోగ్రతలు

● 8.2 డిగ్రీల నమోదు ● ఇబ్బంది పడుతున్న ప్రజలు



అర్లి(టి)లో చలిమంట కాచుకుంటున్న కుటుంబం

ఆదిలాబాద్, జనవరి 26 ( నమస్తే తెలంగాణ): ఆదిలాబాద్ జిల్లాను చలి వణికిస్తున్నది. జిల్లాలో శుక్రవారం రాష్ట్రంలోనే అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కనిష్ట ఉష్ణోగ్రత 8.2 డిగ్రీలుగా నమోదైంది. ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోవడంతో చలి ప్రభావం విపరీతంగా పెరిగింది. చల్లటిగాలులు వీస్తుండడంతో ప్రజలు ఈగంతో వణికిపోతున్నారు. సాయంత్రం 6 గంటలకు ప్రారంభమైన చలి తీవ్రత ఉదయం 10 గంటల వరకు ఉంటున్నది. జిల్లాలో గురువారం 9.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, శుక్రవారం మరింత పడిపోయి 8.2 డిగ్రీలకు చేరుకుంది. ఏజెన్సీ ప్రాంతాల్లో, గ్రామాల్లో చలి తీవ్రత అధికంగా ఉంటున్నది. గ్రామాల్లో ప్రజలు చలిమంటలు కాగుతూ ఉపశమనం పొందుతున్నారు.

# న్యాయస్థానం పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న జడ్జి వరప్రసాద్, స్థానిక జడ్జి బీ హుస్సేన్

బోథ్, జనవరి 26: మండల కేంద్రంలోని జూనియర్ సివిల్ జడ్జి పాత కోర్టు భవనం కూల్చివేత పనులను శుక్రవారం జడ్జి వరప్రసాద్, స్థానిక జడ్జి బీ హుస్సేన్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ కూల్చివేత పనులు పూర్తి కాగానే, త్వరగా భూమి పూజ చేసి భవన నిర్మాణ పనులను ప్రారంభిస్తామని చెప్పారు. అనంతరం బోథ్ కోర్టు ప్రాంగణంలో జిల్లా జడ్జిని బార్ అసోసియేషన్ సభ్యులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వామన్ రావ్ దేశ్ పాండే, కోర్టు సూపరింటెండెంట్ చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.



ఉట్నూర్ : ఐటీడీఏ ప్రాంగణంలో జెండా వందనం చేస్తున్న పీవో ఖుష్బు గుప్తా



ఆదిలాబాద్ రూరల్ : పరేడ్ గ్రౌండ్ మైదానంలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు



నిర్మల్ టౌన్ : కలెక్టరేట్‌లో జెండా ఎగురవేస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అధికారులు



ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో జాతీయ గీతం ఆలపిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ గౌస్ ఆలాం, అధికారులు

# త్రివర్ణ రెపరెపలు

**ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో గణతంత్ర దినోత్సవ వేడుకలు**

● జాతీయ పతాకం ఆవిష్కరించిన కలెక్టర్లు రాహుల్ రాజ్, ఆశిష్ సంగ్వాన్

● పాల్గొన్న ఎస్పీలు, అదనపు కలెక్టర్లు, ఎమ్మెల్యేలు ● ఉత్తమ ఉద్యోగులకు అవార్డుల పంపిణీ

● అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు, శకటాల ప్రదర్శన



నిర్మల్ ఎన్టీఆర్ మినీ స్టేడియంలో విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు



ఆదిలాబాద్‌లో గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ



ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో..

ఆదిలాబాద్, జనవరి 26 ( నమస్తే తెలంగాణ): ఆదిలాబాద్ జిల్లాలో 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పోలీస్ పరేడ్ మైదానంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్‌రాజ్ జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో శకటాలను ప్రదర్శించారు. కలెక్టర్ రాహుల్ రాజ్ ప్రసంగిస్తూ ప్రభు త్వం ఆరు గ్యారెంటీల అమలుకు శ్రీకారం చుట్టిందని అన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజల దరికి చేరుస్తామని చెప్పారు. పాఠశాలల విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వివిధ శాఖల్లో ప్రతిభ చూపిన వారి కి కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ గౌస్ ఆలం ప్రశంసా పత్రాలు అందజేశారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్, డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావు పాటిల్, తదితరులు పాల్గొన్నారు.

**ఐటీడీఏ పరిధిలో**

ఉట్నూర్‌లోని ఐటీడీఏ ప్రాంగణంలో ఇన్‌చార్జి పీవో ఖుష్బు గుప్తా జాతీయ జెండా ఎగురవేశారు. గాంధీ, అంబేద్కర్ చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.

**నిర్మల్ జిల్లాలో..**

నిర్మల్ టౌన్/నిర్మల్ అర్బన్, జనవరి 26: నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో శుక్రవారం 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జిల్లా ఎస్పీ జానకీషర్మిల, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్, అదనపు ఎస్పీ క్రాంతిలాల్‌పాటిల్, జిల్లా అధికారులు పాల్గొన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను పేద ప్రజలకు అందించడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. మొదటగా పోలీసు బలగాల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. శకటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రతిభ చూపిన వారికి బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను కలెక్టర్, ఎమ్మెల్యే, ఇతర అధికారులు సందర్శించారు. డీఎస్పీ గంగారెడ్డి ఆధ్వర్యంలో సీఐలు పురుషోత్తం, శ్రీనివాస్, నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, ఆర్డీవో రత్నకల్యాణి, నిర్మల్ మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, జిల్లా అధికారులు రవీందర్‌రెడ్డి, విజయలక్ష్మి, ప్రభాకర్, హన్మండ్లు, రాజేశ్వర్‌గౌడ్, అంబాజీనాయక్, గంగారెడ్డి, పురుషోత్తంరెడ్డి, అంజీప్రసాద్, అశ్వక్ అహ్మద్, గంగాధరయ్య, శ్రీకళ, జడ్పీ సీఈవో సుధీర్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ రాజు, తదితరులున్నారు.



ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో..



ఆదిలాబాద్‌లో ఒంటిపై నుంచి ద్విచక్రవాహనాన్ని ఎక్కించుకొని విన్యాసం చేస్తున్న విద్యార్థులు



ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో నృత్యం చేస్తున్న విద్యార్థినులు



మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

# విజయవంతం చేయాలి

● బోథ్‌లో నేడు బీఆర్ఎస్ సమావేశం ● ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బోథ్, జనవరి 26: బోథ్‌లోని పరిచయ గార్డెన్‌లో శనివారం ఉదయం నిర్వహించనున్న బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పిలుపునిచ్చారు. బోథ్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల సన్నాహకంలో భాగంగా సమావేశం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సమావేశానికి మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, ఎమ్మెల్సీ దండె విఠల్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మాజీ ఎంపీ జీ నగేశ్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జాన్సన్‌నాయక్, హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీ గ్రామ, పట్టణ కమిటీల అధ్యక్షులు, బూత్ కమిటీల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు హాజరవ్వాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ తుల శ్రీనివాస్, జడ్పీటీసీ ఆర్ సంధ్యారాణి, కన్వీనర్ డీ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అమరవీరుల స్తూపం వద్ద ట్రాక్టర్ బ్లేడ్‌తో భూమి చదును చేస్తున్న ట్రాక్టర్

# సీఎం పర్యటనకు ఏర్పాట్లు

ఇంద్రవెల్లి, జనవరి 26: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలానికి ఈ నెల 28, 29తేదీల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రానున్నందున అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేపడుతున్నారు. మండలంలోని అమరవీరుల స్తూపం ప్రాంతంలో శుక్రవారం బహిరంగ సభా స్థలంలో ట్రాక్టర్ బ్లేడ్‌తో భూమి చదును చేయిస్తున్నారు. ఐకేపీ కార్యాలయంలోపాటు గలియాబాయితండా, ఐఏఫ్‌సీఎల్ జిన్నింగ్ మిల్లు దగ్గర వాహనాల పార్కింగ్ కోసం స్థలాలను పరిశీలించారు. సీఎం పర్యటన సందర్భంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. డీఎల్పీవో భిక్షపతిగౌడ్, ఎంపీడీవో పుష్పలత, ఎస్ఐ డీ సునీల్, ఎంపీవో సంతోష్, ఈవో సంజీవరావ్, నాయకులు ఎండీ మసూద్, మీర్జా యాకుబ్‌బేగ్, తదితరులు పాల్గొన్నారు.

# ఖాందేవ్ క్షేత్రం..ఆధ్యాత్మిక పరిమళం

● మహాపూజతో ప్రారంభమైన జాతర ● రెండున్నర కిలోల నూనె తాగిన తొడసం ఆడబిడ్డ

నార్నూర్, జనవరి 26: నార్నూర్ మండల కేంద్రంలో తొడసం వంశీయుల ఆధ్యాత్మిక శోభ సంతరించుకున్నది. గురువారం అర్ధరాత్రి ఆలయంలో ఖాందేవ్ దేవుడికి తొడసం వంశీయులు సంప్రదాయ పూజ చేసి జాతర ప్రారంభించారు. ఖాందేవ్ సన్నిధిలో తొడసం వంశ ఆడబిడ్డ నువ్వులనూనె తాగే మహోన్నతమైన కార్యక్రమాన్ని నిర్వహించారు. శుద్ధమైన నువ్వుల తైలం సేకరించారు. దేవతామూర్తులకు నైవేద్యంగా సమర్పించిన అనంతరం, ఆ వంశం ఆడబిడ్డ మెస్రం నాగుబాయి రెండున్నర కిలోల తైలం తాగారు. ఆడబిడ్డను నూతన వస్త్రాలతో సన్మానించారు. పెద్ద సంఖ్యలో తొడసం వంశీయులు, భక్తులు తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది. సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఏర్పాటు చేసిన దర్బార్ లో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పాల్గొని మాట్లాడుతూ. .ఆదివాసీ సంస్కృతీసంప్రదాయాలను భావితరాలకు అందించాలని సూచించారు. ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తామన్నారు. యువత ఉన్నత చదువుల్లో రాణిస్తూ, భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ తొడసం నాగోరావ్, నార్నూర్ సహకార సంఘం చైర్మన్ ఆడే సురేశ్, రాయిసెంటర్ జిల్లా సార్‌మెడి మెస్రం దుర్గుపటేల్, వైస్ ఎంపీపీ జాదవ్ చంద్రశేఖర్, తొడసం పెద్దలు బాపురావ్, మోతీరామ్ పటేల్, యాదవ్ షావ్, పాండూ పటేల్, ఆనంద్‌రావ్, తెలంగ్‌రావ్, గోపాల్, గజేందర్, సోము, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



తొడసం పుణ్యభూమిలో తైలం తాగుతున్న ఆడబిడ్డ మెస్రం నాగుబాయి



పూజలు చేస్తున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్

# రైతుబంధు అడిగితే చెప్పలతో కొడతారా..?

● కాంగ్రెస్ సర్కారుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత

● ఎన్నికల హామీల అమలులో కాలయాపన

● బీఆర్ఎస్ శ్రేణులపై దాడుల చేస్తే సహించబోం

● రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో గుణపాఠం తప్పదు

● బీఆర్ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్

సీసీసీ నస్పూర్, జనవరి 26 : ‘రైతుబంధు అడిగితే రైతులను చెప్పులతో కొడతారా.. ఇదేనా ఇందిరమ్మ రాజ్యమంటే.. ముఖ్యమంత్రి ఒకటి చెబితే.. మంత్రులు మరొకటి చేస్తూ ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నారు.’ అంటూ బీఆర్ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ మండిపడ్డారు. 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా నస్పూర్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావుతో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం బీఆర్ఎస్ భవన్‌లో చెన్నూర్, మంచిర్యాల నియోజకవర్గ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండు నెలలైనా గడవక ముందే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. ఎన్నికల ముందు ఆచరణ సాధ్యంకాని హామీలిచ్చారని, 100 రోజుల్లో 6 గ్యారంటీలంటూ 420 హామీలు అమలు చేస్తామని చెప్పి కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. మంచిర్యాల జిల్లాలో ముగ్గురు ఎమ్మెల్యే అభ్యర్థులు గెలిచి వాగ్దానాలు నెలవేర్చలేకపోతున్నారని, చెన్నూర్‌లో 45 వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని, అగ్రికల్చర్ యూనివర్సిటీ, మండలానికో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మిస్తామని చెప్పి ఇప్పుడు ఊసెత్తడం లేదన్నారు. చెన్నూర్ ఎత్తిపోతల పథకం, అయిల్‌పాం ఫ్యాక్టరీలకు కేసీఆర్ ప్రభుత్వం ప్రారంభోత్సవాలు చేస్తే వాటిని రద్దు చేయాలని కుట్రలు చేస్తున్నారన్నారు. రైతులకు రూ. రెండు లక్షల రుణమాఫీ, 200 యూనిట్ల ఉచిత కరెంట్, మహిళలకు రూ. 2500 భృతి, వృద్ధులకు పింఛన్ల పెంపు, మెగా డీఎస్సీ ఏమైందని ప్రశ్నించారు. రైతు బంధు కోసం ఎన్నికలకు ముందు కేటాయించిన నిధులు ఏమయ్యాయో చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ సర్కారులో ఎన్నికలకు ముందు 7 మున్సిపాలిటీల అభివృద్ధికి రూ.25 కోట్ల చొప్పున మంజూరు చేస్తే రద్దు చేయడం సరికాదన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై కక్ష సాధింపుతో కేసులు, దాడులు చేస్తే సహించేదిలేదన్నారు. స్థానిక సంస్థల్లో అవిశ్వాస తీర్మానాలతో నీతిలేని రాజకీయాలు చేస్తున్నారని, ప్రజల కోసం ఎంతటి పోరాటాలకైనా సిద్ధంగా ఉన్నామన్నారు. అవసరమైతే లాఠీ దెబ్బలు తింటామని, జైలుకు కూడా వెళ్లడానికి వెనకాడబోమని స్పష్టం చేశారు. కార్యకర్తలు ఏం జరిగినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని, ప్రజలు తమకు ఇచ్చిన ప్రతిపక్ష బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించాల్సి ఉందన్నారు. అబద్ధపు ప్రచారాలతో గెలిచిన కాంగ్రెస్‌కు రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని చెప్పుకొచ్చారు. ఈ నెల 30న బెల్లంపల్లి, ఫిబ్రవరి 4న చెన్నూర్, 5న మంచిర్యాల నియోజకవర్గాల్లో సమావేశాలు ఉంటాయన్నారు. ఈ సమావేశంలో నాయకులు విజిత్‌రావు, తిప్పని లింగయ్య, అక్కూరి సుబ్బయ్య, మేరుగు పవన్‌కుమార్, ఈ సంపల్లి ప్రభాకర్, పెట్టం లక్ష్మణ్, బేర సత్యనారాయణ, మేడిపల్లి సంపత్, వంగ తిరుపతి, కుర్మిళ్ల అన్నపూర్ణ, గర్శె రామస్వామి, గోగుల రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.



సవర్గాం చెరువు కట్ట వద్ద బీటీ రోడ్డు పనులు

# పూర్తయిన సవర్గాం రోడ్డు పనులు

● వాహనదారులకు తప్పిన తిప్పలు

● కేసీఆర్ సర్కారు హయాంలో రూ.18 కోట్లతో మొదలు

● హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు

తాంసి, జనవరి 26: జందాపూర్ శివారు నుంచి మండలంలోని ఈదుల్లా సవర్గాం గ్రామానికి బీటీ రోడ్డు పనులు చకచకా పూర్తయ్యాయి. గతంలో ఆదిలాబాద్ నుంచి సవర్గాం గ్రామానికి రావాలంటే గతుకుల రోడ్డుతో ఇబ్బంది పడ్డ ప్రజలు, వాహనదారులకు ఇప్పుడు తిప్పలు తప్పనున్నాయి. జందాపూర్ ఫోర్ లైన్ హైవే నుంచి ఏడు కిలో మీటర్ల పొడవు సవర్గాం వరకు బీటీ రోడ్డు పనులు బీఆర్ఎస్ నాయకుల ప్రత్యేక కృషితో రూ.18 కోట్లతో మొదలయ్యాయి. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఈ నిధులు మంజూరు కాగా, రోడ్డు నిర్మాణ పనులు ప్రస్తుతం పూర్తయ్యాయి. నాణ్యతా ప్రమాణాలు తగ్గకుండా రోడ్డు పనులను పూర్తి చేయించినట్లు ఆర్అండ్‌బీ అధికారులు తెలిపారు. తాంసి మండలంలోని సవర్గాం, గోట్కూరితోపాటు జందాపూర్ గ్రామస్తులకు రవాణా సౌకర్యం మెరుగుపడింది. రోడ్డు నిర్మాణ పనులు వేగంగా ముగియడంతో వాహనదారులు, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## సీఎం కేసీఆర్ సహకారంతోనే అభివృద్ధి



బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి కావడంతో రాకపోకలు సజావుగా సాగుతున్నాయి. గతంలో ఈ రోడ్డు గుండా వెళ్లాలంటే చాలా ఇబ్బందిగా ఉండేది. సీఎం కేసీఆర్ సహకారంతో కేసీఆర్ ప్రభుత్వం డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టడం ద్వారా మా ఇబ్బందులు తొలిగాయి. రాకపోకలకు ఇబ్బందులు తప్పాయని గ్రామస్తులు సంతోషపడుతున్నారు. గ్రామంలో అంతర్గత రోడ్డు నిర్మాణం కూడా పూర్తయ్యింది.

**- మునేశ్వర్ భరత్, సర్పంచ్, ఈదుల్లా సవర్గాం**



సవర్గాం చెరువు కట్ట వద్ద నిర్మించిన బీటీ రోడ్డు